క్రైం వార్తలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కేటీదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని నందిన్నె గ్రామానికి చెందిన వ్యక్తి నందిన్నె వాగు నుంచి గువ్వల దిన్నె వైపు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు నందిన్నె శివారులో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ వెంకటేష్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గట్టులో..

గట్టు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం తెల్లవారు జామున బల్గెర సమీపంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. బల్గెరకు చెందిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో గస్తీ తిరుగుతున్న కానిస్టేబుళ్లు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఇటిక్యాల : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ బుధవారం తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని వావిలాలకు విధి నిర్వహణకు పోలీసులు వెళ్తుండగా సాతర్ల సమీపంలో అశోక్ లేలాండ్ వాహన డ్రైవర్ పోలీస్ సిబ్బందిని చూసి వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. వాహనంలో తనిఖీ చేయగా 40 ప్యాకెట్ల (16 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం వాహనాన్ని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



ఎర్రవల్లి : జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్, స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని బీచుపల్లికి చెందిన రాజశేఖర్‌గౌడ్ (30) బైక్‌పై ఎర్రవల్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పదో బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో వెళ్తుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సంఘటనా స్థలానికి వారు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

గద్వాల క్రైం: కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను పెద్ద ఎత్తున పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. శివారు కాలనీకి చెందిన ఓ వ్యక్తి గత కొన్ని రోజులుగా కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ చేసి విక్రయిస్తున్నాడన్నా ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి పోలీసులు దాడులు చేపట్టారు. దాడిలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ నిల్వ చేసిన గోదాంలో తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున్న డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై గద్వాల సీఐ శ్రీనును సాక్షి వివరణ కోరగా.. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో సోదాలు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విచారణ దశలో ఉంది పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ కిందపడి బాలిక మృతి



గట్టు: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై ఇటుకల లోడు ట్రాక్టర్ రివర్స్ చేసుకునే క్రమంలో ట్రాలీ బాలికపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ కథనం మేరకు.. తుమ్మలపల్లికి చెందిన సంధ్య, హుస్సేన్ కుమార్తె రిషిక(4) ఇంటి ముందు రోడ్డుపై ఒక్కతే ఆడుకుంటోంది. బోయ సత్తెమ్మ ఇంటి నిర్మాణం కోసం ఇటుక లోడుతో వచ్చిన ట్రాక్టర్ రివర్స్ తీసుకునే క్రమంలో ఇంటి పక్కనే ఆడుకుంటున్న బాలికపై ఎక్కించాడు. దీంతో రిషిక అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదమరిచారో అంతే సంగతులు

- మూల మలుపులలో పొంచి ఉన్న ప్రమాదం
- కానిరాని హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు వద్ద ప్రమాదకర మూలమలుపు

మానవపాడు: ప్రధాన రహదారుల్లో ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు కుడా లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు కమ్మేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు ప్రధాన రహదారులపై మూల మలుపుల వద్ద రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటేనే ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మారాయి..

మండలంలోని 17 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగతున్నాయి. చెన్నిపాడు నుంచి పెద్దపతులపాడుకు వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పోతులపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు వెళ్లే రహదారిలోనూ ప్రమాదకరంగా మూల మలుపులు దర్శనమిస్తున్నాయి. మానవపాడు నుంచి జాతీయ రహదారి- 44కు వెళ్లే డీ-31 కాలువ వద్ద మలుపుల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. మానవపాడు నుంచి గోకులపాడు మీదుగా వెళ్లే రహదారిలో మూల మలుపుల వద్ద రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

సూచిక బోర్డులు కూడా లేవు..

మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు, ప్రమాదకర హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వాహనదారులు వాపోతున్నారు. అదే విధంగా కొర్విపాడు నుంచి జాతీయ రహదారి వెళ్లే రోడ్డు, జల్లాపురం నుంచి చందూరుకు వెళ్లే రోడ్డు, చందూరు నుంచి పల్లెపాడుకు వెళ్లే రహదారి, బోరవెల్లి నుంచి జల్లాపురానికి వెళ్లే దారి, బోరవెల్లి నుంచి పల్లెపాడుకు వెళ్లే రహదారిలో ఎలాంటి సూచిక



చెన్నిపాడు పాఠశాలకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

బోర్డులు, హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి..



మండలంలోని చెన్నిపాడు గ్రామం నుంచి పెద్దపోతులపాడుకు వెళ్లే రహదారిలో మూల మలుపుల వద్ద ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. వాహనదారులకు కనిపించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

-రవికుమార్, చెన్నిపాడు

మలుపుతో ప్రమాదం..



మానవపాడు మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి- 44కు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో వాహనాలు వేగంగా రావడంతో పాటు బోర్డులు లేక ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

- నాగేష్, మానవపాడు

చర్యలు తీసుకోవాలి..



మండలంలో మూల మలుపుల వద్ద వేగ నిరోధకాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదలు జరుగకుండా ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి. రహదారిలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ప్రయాణాలు చేస్తున్నాం.

-సుధాకర్, గోకులపాడు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

అలంపూర్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ మొగులయ్య సూచనల మేరకు బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు తక్షణమే 1930 నంబర్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటస్వామి, ఏఎస్ఎస్‌ఎం బాష, సిబ్బంది, , ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన..

మానవపాడు: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. బుధవారం మండలంలోని అమరవాయి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఎస్‌ఎంఎస్, ఈ- మెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



జల్లాపురంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీఏ అధికారులు

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన..

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులభతరంగా పాఠాలు బోధించాలి



మల్దకల్ : విద్యార్థులకు సులభతరంగా పాఠాలు బోధించాలని ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్ అన్నారు. బుధవారం మల్దకల్‌లో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభతరంగా పాఠాలు బోధించి వారి మేధాశక్తిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను బట్టి బోధన చేయాలన్నారు. అలాగే అమరవాయి, కుర్తిరావల్‌చెర్వు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బిట్ బ్యాంక్ మెటీరియల్‌ను ట్రస్ట్ సభ్యులు రత్నసింహారెడ్డి అందజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే కాదు.. చెట్లూ మాయం



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై హరితహారం భాగంలో నాటిన మొక్కలు కనుమరుగయ్యాయి. మొక్కలు కొన్ని చెట్లుగా కూడా మారాయి. వాటికి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో కొందరు వాటిని కొట్టివేశారు. విద్యుత్ వైర్లకు అడ్డొస్తున్నాయని కొన్ని, రైతుల పొలాలకు అడ్డుగా ఉన్నాయని కొన్ని తొలగించారు. దీంతో ప్రజలు, వాహనదారులకు నిలువ నీడ కూడా లేకుండా పోయింది. ఉన్న కొన్ని మొక్కలనైనా రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఇటిక్యాల : మండల పరిధిలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, వాస్తు హోమం, వైనతేయ ప్రతిష్ట, నివేదన హారతి తదితర క్రతువులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.



స్వామి వారి మూలవిరాట్టు

కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ఆత్మకూర్: స్వామినాథన్ సిఫార్సులకు మేరకు రైతులు పండించిన పంట పెట్టుబడికి 50 శాతం కలిపి నిర్ణయిస్తామని 2014లో హామీనిచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదట అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజన్న, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా కోశాధికారి రాజు, ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయక పోగా రైతుల నడ్డి విరిచేందుకు మూడు కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని దుయ్యబట్టారు. 13 నెలల పాటు రైతుల ఉద్యమాలు చేపడితే పోలీసులతో లాఠీచార్జ్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేయాలని, రెండు పంటలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చితలన్న, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘాల నాయకులు

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలి

అమరచింత: విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసి భావిభారత సైంటిస్టులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పారిశ్రామికవేత్త మధులాష్‌బాబు ఆధ్వర్యంలో చేపడుతున్న కలాం స్ఫూర్తి యాత్ర బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కలాం స్ఫూర్తి యాత్ర చేరుకుంది. వారు మాట్లాడుతూ ఆధునిక, సాంకేతికతను నేరుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్దకే వచ్చి ప్రేరణ కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాత్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కృషి అభినందనీయం



ఎస్పీ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న శాంతినగర్ వాసులు

శాంతినగర్ : కిడ్నాప్ కేసును 8 గంటల్లో ఛేదించిన పోలీసుల కృషి అభినందనీయమని కిడ్నాప్‌కు గురైన బాధితుడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, శాంతినగర్ వ్యాపారులు అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు బొకే ఇస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతినగర్‌కు చెందిన రమేష్ బాబు కిడ్నాప్ కేసులో బాధితునికి ఎలాంటి హానీ కలుగకుండా, ఆర్థికంగా నష్టపోకుండా కాపాడి ఇంటికి చేర్చడంపై బాధిత కుటుంబ సభ్యులతోపాటు శాంతినగర్‌కు చెందిన వ్యాపారులు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి ధన్యవాదాలు తెలియజేశారు. కిడ్నాపైన తన భర్త ఆపదలో ఉన్నట్లు గమనించి పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య సుభాషిణిని ఎస్పీ అభినందించారు. సమస్యలు వచ్చినప్పుడు ప్రతి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా న్యాయం జరగుతుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసుతన్న అఖిల పక్షం కమిటీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సంతోష్‌కు అఖిల పక్షం కమిటీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో మౌలిక వసతులు లేవని, తాగునీటి సమస్య, విద్యుత్ సౌకర్యం సరిగా లేదని తెలిపారు. పీహెచ్‌సీ పక్కన నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి నిర్మాణం నిలిచిపోయిందని వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వెంకట్రాములు, పల్లయ్య, మద్దిలేటి, శరణప్ప, మారెప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రతిభా పరీక్షలు

గట్టు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ప్రతిభా పరీక్ష, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండంలోని వివిధ పాఠశాలలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. శివమణి (గట్టు), ఉమ (మాచర్ల), హెచ్ రాజు (గట్టు), ఉపన్యాస పోటీల విభాగంలో పవిత్ర (ఇందువాసి), గీతాంజలి (ఆలూరు), గురుకుల విభాగంలో స్రవంతి (కేజీవీబీ-గట్టు), ప్రణీత (కేజీవీబీ-గట్టు), కావేరి(కేజీవీబీ-గట్టు) విజేతలుగా నిలిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విజేతలకు ఎంఈఓ నల్లారెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. విజేతలకు ఈ నెల 21న బహుమతులు అందజేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ నల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తిని నింపేందుకు ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చాటి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింహులుగౌడ్, ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, రాజేష్‌కుమార్, చంద్రశేఖర్, శివ, నర్సింహులు, శ్రీధర్ పాల్గొన్నారు.

16 నుంచి హయగ్రీవ ఉత్సవాలు



లక్ష్మీ హయగ్రీవస్వామి ఆలయం(ఫైల్)



బీచుపల్లి లక్ష్మీహయగ్రీవ స్వామి

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శ్రీలక్ష్మీ హయగ్రీవ జ్ఞాన సరస్వతి విశ్వక్సేన ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు హయగ్రీవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 16న భగవదనుజ్ఞాన, విశ్వక్సేరాధన, పుణ్యాహ వచనం, 17న యాగశాల ఆరాధన, బాలాలయం నుంచి కలాకర్షణం, ప్రధాన కలశ స్థాపనం , 18న శ్రీలక్ష్మీ హయగ్రీవ మూలమంత్ర హోమాలు, మహాలక్ష్మీయాగం, 19న మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో ఉత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఇట్టి అష్టబంధన మహాసంప్రోక్షణ (పునఃప్రతిష్ఠ) కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే అష్టబంధన మహా సంప్రోక్షణ హోమాల్లో పాల్గొనే దంపతులు ముందుగా ఆలయంలో రూ.5,116 చెల్లించి టోకెన్ తీసుకొని పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 70139 30933, 77806 49106ను సంప్రదించాలని పేర్కొన్నారు.

10న ఉత్తరద్వార దర్శనం

కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ధరూరు : ప్రతి పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. మండల పరిధిలోని కొత్తపాలెం తండా, కోతులగిద్ద ఎంపీహెచ్‌ఎస్, కొత్తపాలెం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను రవీంద్రబాబు బుధవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యత పాటించాలన్నారు. సరుకుల విషయంలో అలసత్వం వహించకూడదన్నారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్ర బాబు

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి



శాంతినగర్ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

శాంతినగర్ : సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ వై.మొగులయ్య శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్‌ఐ సంతోష్‌ను ఆదేశించారు. సాధారణ విజిట్‌లో బాగంగా బుధవారం శాంతినగర్ సర్కిల్, స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, నేరాలకు సంబంధించిన ఫైళ్లు తనిఖీ చేశారు. శాంతినగర్ సీఐ, ఎస్‌ఐ, పట్టణ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించవద్దన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కిడ్నాప్ ఉదంతంతో వ్యాపారస్తులు భయాందోళనకు గురవుతున్నారని, వ్యాపారస్తులకు పోలీసులు అండగా ఉండాలని వ్యాపారస్తులు కోరారు. స్పందించిన డీఎస్పీ ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు.

ప్రజలతో మమేకం కావాలి..

మానవపాడు: నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని డీఎస్పీ వై. మొగలయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ టాటాబాబు, ఎస్‌ఐ చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.